
క్లుప్తంగా

మల్లేశ్వరస్వామికి అన్నాభిషేకం


అన్నాభిషేకం అనంతరం స్వామివారి అలంకారం

చీరాల అర్బన్: పట్టణంలోని చీరాల శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో స్వామివారికి అన్నాభిషేక కార్యక్రమం నిర్వహించారు. మల్లేశ్వరస్వామి దేవస్థానం, అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా స్వామివారికి అన్నంతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం కార్తీక సమారాధన, అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను కమిటి అధ్యక్షుడు మారుబోయిన పాపారావు, కార్యదర్శి గుండపు వరద రాజేంద్రకుమార్, కోశాధికారి వూటుకూరి కృష్ణమోహన్‌లు పర్యవేక్షించారు.

అమ్మవారికి వెండి కిరీటం, హుండీ బహూకరణ


ప్రత్యేక పూజలు చేస్తున్న దాతలు

యద్దనపూడి: మండల కేంద్రం యద్దనపూడిలో కొలువై ఉన్న గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో గొట్టిపాటి శేషగిరి, శ్రీనివాస్ అనంతలక్ష్మి దంపతులు రూ.76 వేలు విలువజేసే వెండి కిరీటాన్ని బహూకరించారు. అలాగే తుర్లపాడు గ్రామానికి చెందిన నల్లపాటి సతీష్, భానుప్రియ దంపతులు రూ.10,500 విలువైన హుండీని ఆలయానికి అందజేశారు. ఈసందర్భంగా అర్చకులు అమ్మవారికి విశేషపూజలు నిర్వహించి వెండి కిరీటాన్ని అమ్మవారికి అలంకరింపజేశారు.

ఉపాధ్యాయుడికి సత్కారం


అవార్డు అందుకున్న వేణుగోపాలరావు

వేటపాలెం: ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న ఉపాధ్యాయుడికి సన్మానం చేశారు. పందిళ్లపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల్లో సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఉమ్మిటి వేణుగోపాలరావుకు ఉత్తమ సోషల్ స్టడీస్ టీచర్‌గా అవార్డు అందుకున్నాడు. ఆదివారం విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేశారు. సోషల్ స్టడీస్‌లో చేసిన సేవలకు గాను స్టేట్ బెస్ట్ సోషల్ టీచర్‌గా ఎంపిక చేసి అవార్డు బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

బైబిల్ పరీక్షకు 40 మంది హాజరు


ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు

చినగంజాం: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని చినగంజాం అంబేద్కర్ నగర్ పెద్ద చర్చి వద్ద ఆదివారం నిర్వహించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి బైబిల్ పరీక్షకు 40 మంది హాజరయ్యారు. ప్రశ్నాపత్రం ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా సెంట్రల్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ మేడికొండ సూరిబాబు, పంచాయతీ ఉద్యోగి మల్లేశ్వరరావు హాజరయ్యారు. పరీక్ష ఇన్విజిలేటర్‌గా గేరా ఆషా వ్యవహరించారు. అంబేద్కర్ నగర్ పెద్దలు, ఎంప్లాయీస్ అసోసియేషన్, అంబేద్కర్ యూత్ సభ్యులు ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించగా పరీక్షను మేకల మేషక్ బాబు నిర్వహించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ సభ్యుడు బడుగు విజయ్, మార్పు జాకబ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కలిగిఉన్న వ్యక్తి అరెస్టు

చీరాల: అక్రమంగా మద్యం కలిగిఉన్న వ్యక్తిని ఆదివారం ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చీరాల ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎక్సైజ్ బి.శ్రీహరి, సిబ్బంది ఆదివారం చీరాల మండలం జాండ్రపేట ప్రాంతాలలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జాండ్రపేటలోని కామంచి నాగరాజు అనే వ్యక్తి అక్రమంగా మద్యం కలిగిఉండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 12 షాట్ విస్కీ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): జూదం ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై పట్టాభిరామయ్య వివరాల మేరకు.. ఆదివారం రాత్రి సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశామన్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకొని రూ. 14,300 స్వాధీనం చేసుకున్నారు. కోడిపందేలు, పేకాట ఆడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

సూసైడ్ స్పాట్‌గా..

గుండ్లకమ్మ వంతెన


అద్దంకిలోని గుండ్లకమ్మ బ్రిడ్జి


బ్రిడ్జిపై ఎత్తుగా లేని సైడు గోడలు

- అద్దంకిలో తరుచుగా బ్రిడ్జి మీద నుంచి దూకుతున్న క్షణికావేశపరులు, సున్నిత మనస్కులు
- ఈత కోసం వెళ్లి కూడా మృత్యువాత
- బ్రిడ్జి సైడు గోడలు ఎత్తు లేకపోవటమే కారణం


బ్రిడ్జిపై నుంచి చూస్తున్న ఎస్సై (ఫైల్)


బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న యువకుడి మృతదేహం (ఫైల్)

అద్దంకి రూరల్: ఆధునిక సాంకేతికయుగంలో మనిషి మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నాడు. ఫలితంగా మనిషి బలవన్మరణాలకు పాల్పడుతూ అర్ధరంతరంగా తనువు చాలిస్తున్నాడు. నల్లమల కొండల్లో పుట్టి సముద్రంలో కలుస్తూ రైతన్నల ఆకలి తీరుస్తున్న గుండ్లకమ్మ నది ఆత్మహత్యలకు, ప్రమాదవశాత్తు మరణాలకు అడ్డగా మారుతోంది. అద్దంకి సమీపంలో గుండ్లకమ్మ బ్రిడ్జిని కొందరు క్షణికావేశపరులు, సున్నిత మనస్కులు ఆత్మహత్యలకు పాల్పడి సూసైడ్ స్పాట్‌గా మార్చేస్తున్నారు. అంతేకాకుండా సరదా కోసం అని ఈతకు వెళ్తా ఈతరాక మృత్యువాత పడుతున్నారు.

అర్ధ శతాబ్దాల కాలం నుంచి..

అద్దంకి అభివృద్ధిలో అర్ధశతాబ్దం నుంచి భాగస్వామ్యంగా నిలుస్తూ, రాకపోకలకు వారధిగా ఉంది గుండ్లకమ్మ బ్రిడ్జి. రోజులు మారుతున్న కొద్ది వాహనాల రద్దీతో రాత్రి, పగలు తేడా లేకుండా బ్రిడ్జి మీద నుంచి వందలకొద్ది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జీవితంలో ఏ చిన్న సమస్య వచ్చినా తట్టుకోలేని మనస్సు కలవారు చావే శరణ్యమని భావిస్తూ క్షణికావేశంలో మృత్యువును వెతుకుంటూ బ్రిడ్జి మీదకు వచ్చి దూకేస్తున్నారు. ఈ ప్రాంతంలో గడిచిన ఆరునెలల్లో యువత, వృద్ధులు దూకి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

➤ ఇటీవల పట్టణానికి చెందిన 18 సంవత్సరాల యువకుడు తల్లిదండ్రులు మందలించారన్న నెపంతో బ్రిడ్జి మీద నుంచి దూకి తనువు చాలించాడు. ఇలాగే ప్రేమ సమస్యలతో, కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి కలిగిందని కొందరు ఆత్మహత్య చేసుకునేందుకు బ్రిడ్జిపై నుంచి దూకుతున్నారు. ఇలాంటి దుర్ఘటనలు ఇక్కడ తరుచూ సంభవిస్తున్నాయి.

➤ నవంబర్ 7వ తేదీన నలుగురు స్నేహితులతో కలిసి సరదాగా నదిలో ఈత కొట్టేందుకు వెళ్లి వారిలో ఒక యువకుడు నదిలోకి జారి మృత్యువాత పడ్డాడు. మృతుగు ప్రకాశం జిల్లా ముండ్లమూరుకు చెందిన తేలుకుట్ల నారాయణ (27) అద్దంకిలో ఫొటో గ్రాఫర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ప్రమాదవశాత్తు నదిలో మునగడంతో ప్రాణాలు కోల్పోయాడు.

బ్రిడ్జి సైడు గోడలు ఎత్తు లేకపోవటమే..

సుమారు 50 సంవత్సరాల క్రితం కట్టిన బ్రిడ్జికి రెండు వైపులా ఉన్న గోడలు చిన్న పిల్లలు సైతం ఎక్కేందుకు వీలుగా ఉన్నాయి. అవి ఎత్తులేకపోవటమే దూకడానికి తేలికగా ఉంది. వీటి ఎత్తుపెంచి, ఇనుప కంచెలాంటిది ఏర్పాటు చేస్తే ఆత్మహత్యలను నివారించవచ్చని అద్దంకి ప్రజలు భావిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సూచనలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తాం..

ఇటీవల కొంతమంది గుండ్లకమ్మ వంతెన పైనుంచి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఇది సరియైనది కాదు. బతికి సాధించాలే తప్పా ఇలా బలవన్మరణానికి పాల్పడకూడదు. అంతేకాకుండా నదిలో స్నానానికి వచ్చే భక్తులు, మాలధారులు అప్రమత్తంగా ఉండాలి. ఈతరానప్పుడు ఒడ్డుమీద నుంచే స్నానం చేయడం ఉత్తమం. మీకోసం మీ కుటుంబ సభ్యులు ఇంటి వద్ద ఎదురుచూస్తుంటారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలి. సూచనలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తాం.

– కృష్ణయ్య, సీఐ, అద్దంకి

పాలిటెక్నిక్‌తో ఉద్యోగవకాశాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎండీ శ్రీనివాసరెడ్డి, అవ్వారు ముసలయ్య

చీరాల: పాలిటెక్నిక్‌తో ఎన్నో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తిరుపతి శ్రీసిటి కంపెనీ వాషింగ్ మెషిన్ విభాగం ఎండీ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు అవ్వారు ముసలయ్య నివాసంలో పాలిటెక్నిక్, ఈసెట్ విద్యనభ్యసించిన విద్యార్థులకు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఉద్యోగం రావడం అనేది చాలా కష్టంగా ఉందన్నారు. పదోతరగతి నుంచి బీటెక్ వరకు చదువుకున్న విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు కోసం ఎదురుచూస్తున్నారన్నారు. చీరాలకు చెందిన అవ్వారు ముసలయ్య ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. ప్రతి ఏటా అనేక మంది విద్యార్థులు శ్రీసీటిలో ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. అతి తక్కువ ధరకు వసతి గృహం, ఇతరత్రా సదుపాయాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కంపెనీలో రెండేళ్ల ఉద్యోగం చేసిన వారు అదే కంపెనీలో నెలకు రూ.40 వేలు జీతం తీసుకోవచ్చన్నారు. ఉద్యోగావకాశాల కోసం తనను సంప్రదించవచ్చన్నారు.

దుకాణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకట్రావు

కారంచేడు: దుకాణదారులు తప్పకుండా తమ పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై వీ వెంకట్రావు అన్నారు. ఆదివారం రాత్రి ఆయన మండల కేంద్రం కారంచేడు పీఎస్‌లో స్వర్ణ గ్రామానికి చెందిన వ్యాపారులతో ఆయన పలు అంశాలపై చర్చించి వారికి అవగాహన కల్పించారు. ప్రధానంగా కిరాణా, మెడికల్ షాపులు, టీకొట్లు, హోటళ్లు, ఇతర దుకాణాలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీని వలన కొత్త వారు వచ్చినప్పుడు వారి కదలికలపై అనుమానాలు ఉన్నప్పుడు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అనుమానితులతో పాటు, దొంగలను కూడా నివారించచ్చన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లోనూ ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సాయి, పోలీస్ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉంటే సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న భవనం భద్రిరెడ్డి


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

వేటపాలెం: రెడ్లు అన్ని రంగాల్లో రాణిస్తూ ఐకమత్యంగా ఉండాలని ప్రధానోపాధ్యాయుడు భవనం భద్రిరెడ్డి పేర్కొన్నారు. రామన్నపేట శివారులో పంట పొలాల్లో కనక నాగవరపమ్మ అమ్మవారం దేవస్థానం ప్రాంగణంలో జాగృతి రెడ్డి సంక్షేమ సంఘం కార్తీక వనసమారాధన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమాశంలో హెచ్‌ఎం మాట్లాడుతూ చీరాల నియోజకవర్గంలో ఉన్న రెడ్లు అందరూ కలసికట్టుగా మెలగాలని సూచించారు. రెడ్లలో చీలిక తీసుకురావడానికి కొన్ని శక్తులు పనిచేస్తున్నాయన్నారు. రెడ్ల చరిత్ర ఇప్పటి కాదని వందల ఏళ్ల నాటిదన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం కార్తీక వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అక్కల పోలిరెడ్డి, గౌరవ సలహాదారు పిన్నప రెడ్డి శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ కంచి సాంబిరెడ్డి, ఉపాధ్యక్షులు రొండా భరత్‌రెడ్డి, బక్కా బోస్‌రెడ్డి, రొండా పేరిరెడ్డి, ఆట్ల చంద్రశేఖర్‌రెడ్డి, వాలి ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక వన సమారాధన


కార్తీక వన సమారాధనలో పాల్గొన్న భక్తులు


పవని భానుచంద్రమూర్తిని సత్కరిస్తున్న అతిథులు

చీరాల అర్బన్: ఈశ్వరుడికి, విష్ణువుకు ఎంతో ప్రీతికరమైన కార్తీకమాస వనసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక స్వర్ణ రోడ్‌లోని దత్తక్షేత్రంలో నిర్వహించారు. ఉదయం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నందికేశుని నోము, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. అనంతరం ఆధ్యాత్మికవేత్త ధర్మవరపు వెంకటరమణ, శ్రీరామకృష్ణ సేవా సమితి సామాజిక సేవకులు వెల్లంచేటి సత్యనారాయణమూర్తి, భ్రమరాంబ సేవా సమితి వ్యవస్థాపకులు మంచిరాజు వెంకటసీతామహాలక్ష్మి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న గోనెళ్ళ శేషవరలక్ష్మి, పవని భానుచంద్రమూర్తిలకు ఆత్మీయ సత్కార కార్యక్రమాలను నిర్వహించారు. అలానే మన సనాతన ధర్మ అనే అంశంపై నందిరాజు విజయ్‌కుమార్‌చే ఆధ్యాత్మిక ప్రవచనాన్ని నిర్వహించారు. అనంతరం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో బ్రాహ్మణ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

కారంచేడులో..

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు గ్రామదేవతగా విరాజిల్లుతున్న గంగమ్మతల్లి గుడి ప్రాంగణంలో ఆదివారం కార్తీక మాసం చివరి ఆదివారం కార్తీక మాస వనసమారాధనలు కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉసిరిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తుల వన సమారాధనలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిన్నారులు దేవుడి స్వరూపులు


దేవుని పాటలకు నృత్యం చేస్తున్న చిన్నారులు

చీరాల రూరల్: చిన్నారులు దేవుడి స్వరూపులని.. వారు దేవుడి రాజ్యానికి వారసులని రెవరెండ్ కె. ఆనంద్ అనూప్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో సండేస్కూలు సండే ఎంతో వైభవంగా నిర్వహించారు. ముందుగా చర్చి పాస్టర్లు రెవరెండ్ పిల్లి దేవదాసు, రెవరెండ్ నానిబాబులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఆదివారం చర్చిలో పాస్టర్లు నిర్వహించే ఆరాధన క్రమాలను చిన్నారులు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రెవరెండ్ ఆనంద్ అనూప్ కుమార్ పాల్గొని ఆత్మ ఫలాలు అనే అంశంపై దేవుని వాక్య సందేశం అందించారు. ప్రతి ఏడాది క్రిస్మస్ పండుగకు ముందు క్రమంతప్పకుండా చిల్డ్రన్స్ సండే నిర్వహిస్తున్నట్లు చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ పేర్లి ఆనంద్ బాబు, సండేస్కూలు పర్యవేక్షకుడు దేటా దివాకర్, వైస్ పర్యవేక్షకులు పీసీసీ, ఎల్‌సీసీ, యూత్ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారు చేయాలి


పర్చూరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీఆర్వో గంగాధర్ గౌడ్


స్వర్ణలో ఓటరు జాబితా పరిశీలిస్తున్న తహశీల్దారు అనిత


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న చినగంజాం తహశీల్దార్

చినగంజాం/కారంచేడు: తప్పులు దొర్లని సక్రమమైన ఓటర్ల జాబితా తయారు చేయాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. ప్రత్యేక క్యాంపెయిన్ డేని పురస్కరించుకొని ఆదివారం మండల పరిధిలోని కడవకుదురు, సోపిరాల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సందర్శించి పరిశీలించారు. ఈ విషయమై బీఎల్వోలకు ఓటర్ల జాబితాలోని పేర్లను గ్రామస్తులకు చదివి వినిపించాలని, జాబితాలో ఒకే కుటుంబంలోని ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండాలని, ఫోటోలు సక్రమంగా లేకుంటే వారిని గుర్తించి తీసుకోవాలన్నారు. ఇంటి నంబర్లు, వయస్సు, చనిపోయిన వారి పేర్లు తొలగించడం కోసం దరఖాస్తులు పెట్టించాలన్నారు. కార్యక్రమంలో బీఎల్వోలు పాల్గొన్నారు.

➤ పర్చూరులోని ఐదు పోలింగ్ కేంద్రాలను బాపట్ల డీఆర్వో జీ గంగాధర్ గౌడ్ ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా పరిశీలించారు. పర్చూరు తహసీల్దార్ బ్రహ్మయ్యతో కలిసి 140, 141, 142, 143, 144 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటరు జాబితా గురించి అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఐ బీ ప్రేమ్‌కుమార్, బీఎల్వోలు పాల్గొన్నారు.

➤ అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా నమోదులతో పాటు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని కారంచేడు ఇన్‌చార్జ్ తహశీల్దారు అనిత అన్నారు. ఆమె మండలంలోని కారంచేడు, స్వర్ణ, కొడవలివారిపాలెం గ్రామాల్లో ఓటరు క్యాంపులను ఆమె పరిశీలించారు. నిర్లక్ష్యంగా ఉండే బీఎల్వోలపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సమాజ, ఆధ్యాత్మిక సేవలతో ఆనందం


మెగా వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

చీరాల టౌన్: సమాజ సేవ, ఆధ్యాత్మిక, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రతి ఒక్కరికి సేవ చేయడమే రామానంద సరస్వతి ట్రస్ట్ లక్ష్యమని ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతి ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత మెగా షుగరు శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన 1209 మంది వైద్య శిబిరానికి హాజరు కాగా వీరికి డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ లలిత ప్రకాష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కృష్ణారావు, శంకరరావు, సురేష్, బసవరావు, శ్రీనివాస్, కామేశ్వరరావు, గోపాల్, కుమార్ పాల్గొన్నారు.

205 మంది స్వాములకు అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల పాత గుంటూరు రోడ్డులో గల అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్పలకు అన్నదాన వితరణ చేశారు. గణపతి మురుగన్ అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో 36 రోజు ఆదివారం 205 మందికి అన్నదానం నిర్వహించినట్లు సేవాసమితి సభ్యులు తెలిపారు. అన్న దాతలుగా మేదరమెట్ల గ్రామానికి చెందిన రేగుల సంజీవరావు, రమణ కుటుంబ సభ్యులు వ్యవహరించినట్లు వారు తెలిపారు.

మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడిగా భాస్కరరావు

కారంచేడు: మండల వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడిగా కొడవలివారిపాలెం గ్రామ వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న తలకాయల భాస్కరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రం కారంచేడు వైఎన్‌ఓ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా కుంకలమర్రు వీఆర్‌ఓ ఈదర ఇర్మియా, ట్రెజరర్‌గా ఆదిపూడి వీఆర్‌ఓ రామిశెట్టి రంగయ్య, కార్యదర్శిగా కారంచేడుకు చెందిన గర్నెపూడి ప్రకాష్‌బాబులను వారు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎయిడ్స్ నిర్మూలనే హెల్ప్ లక్ష్యం


అవగాహన కల్పిస్తున్న హెల్ప్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

అద్దంకి రూరల్: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ బీవీ సాగర్ అన్నారు. ఆదివారం మండలంలోని శింగరకొండ దేవస్థానం వద్ద ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టాల్స్ ఏర్పాటు చేసి వివరించారు. 2030 నాటికి ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ చెన్నయ్య, కరుణ, మల్లేశ్వరీ, శివపార్వతి పాల్గొన్నారు.